
# 'అంబేద్కర్'కు తాళమా? ఇది ప్రజాస్వామ్యమా?

- రైతుబంధు పథకంతో కేసీఆర్ సారు దేవుడైండు
- ఫ్యూచర్ సిటీకి, అమరావతికి ఏదో బంధం కనిపిస్తున్నది
- మండలిలో ప్రజాకవి, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న వ్యాఖ్యలు



హైదరాబాద్, మార్చి 21 (నమస్తే తెలంగాణ): అంబేద్కర్ విగ్రహాన్ని కేసీఆర్ నిర్మించారని చెప్పి జనం చూడకుండా విగ్రహం గేటుకు తాళం వేయటం ఏ రకమైన ప్రజాస్వామ్యం అని ప్రజాకవి, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న నిలదీశారు. శాసనమండలిలో శుక్రవారం రాష్ట్ర బడ్జెట్‌పై ఆయన మాట్లాడారు. జనసంఘ్‌కు చెందిన శ్యామా ప్రసాద్ ముఖర్జీ, రిపబ్లికన్ పార్టీకి చెందిన అంబేద్కర్ భిన్న భావజాలాలు గల వ్యక్తులని, ఆ ఇద్దరు ఒకే వేదిక మీద మాట్లాడుతున్నప్పుడు ఒకరి అభిప్రాయాన్ని మరొకరు గౌరవించుకున్నారని చెప్పారు. అది భారతీయ ప్రజాస్వామ్యానికి ఉన్న లక్షణమని అన్నారు. సరిగ్గా దానికి భిన్నంగా అంబేద్కర్ విగ్రహానికి తాళం వేస్తే ఏ రకమైన ప్రజాస్వామ్యం అని అనుకోవాలని నిలదీశారు. తమిళనాడులో జయలలిత పెట్టిన అమ్మ క్యాంటీన్‌ను స్టాలిన్ తొలగించలేదని, ఆమె ఫొటోతోనే కొనసాగిస్తున్నారని గుర్తుచేశారు.

### రైతుభరోసా అందరికీ ఇవ్వాలి

రైతుబంధు పథకంతో రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నదాతలకు దేవుడు అయిండని గోరటి వెంకన్న కొనియాడారు. 'ఆరు అరకలు కట్టే పెద్ద రైతులు కూడా, అరటెద్దును అమ్మి అరువుకిచ్చిరి పొలము' అని తాను రాసిన పాట పాడి వినిపించారు. ఇదే సభలో రైతుబంధు మీద తాను కొంత వ్యతిరేక భావంతో మాట్లాడినట్టు గుర్తుచేసుకున్నారు. కానీ 20 ఎకరాలు ఉన్న రైతుకు కూడా తప్పకుండా రైతుబంధు ఇవ్వాలని ప్రతిపాదించారు. బంజరు భూములు, బీడు భూములు, రియల్ ఎస్టేట్ భూములను రైతుభరోసా నుంచి మినహాయించవచ్చని, కానీ ఐదు ఎకరాలకు మించిన రైతులకు భరోసా ఇవ్వం అనటంలో అర్థం లేదని అన్నారు. రైతు భరోసాకు రూ.50 వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. 'గ్రామీణ ఆర్థిక వ్యవస్థ ఛిన్నాభిన్నమై పోయిందని, రైతుల దగ్గర పైసలుంటే సాగు మీద పెట్టుబడి పెడుతరని, రైతుబంధు పథకంతోనే సారును (కేసీఆర్) రైతులు దేవుడని పొగుడుతున్నరని' చెప్పారు.

### ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌ల ఘనత కేటీఆర్‌దే

పదేండ్ల క్రితం 2014లో రెండు లక్షల మందికి ఉపాధి కల్పించిన ఐటీ రంగం.. 2023 నాటికి 10 లక్షల మందికి ఉపాధినిచ్చే స్థాయికి ఎదిగిందని, అది కేటీఆర్ గొప్పతనమని గోరటి వెంకన్న కొనియాడారు. దీన్ని ఇప్పటి ప్రభుత్వం మరింత వేగవంతం చేయాలని సూచించారు. ఫ్లైఓవర్లు, అండర్‌పాసులు నిర్మించిన ఘనత కేటీఆర్‌దే అన్నారు. ఆనాడు సీఎంగా ఉన్న చంద్రబాబు నగరాలు గొప్పవి.. పల్లెలు పనికిరావని అన్నారని, వైఎస్సార్ సీఎంగా వచ్చాక పల్లెలకు ప్రాముఖ్యత ఇచ్చారని, కానీ కేసీఆర్ సీఎం అయ్యాక అటు పల్లెలు, ఇటు పట్టణాలు రెండింటి సమ్మిళిత అభివృద్ధిని చేసి చూపించారని వివరించారు. ఫార్మా హబ్‌ను, ఫ్యూచర్‌సిటీని కలిపి పెడతామనటంలో ఏదో కిరికిరి కనిపిస్తున్నదని అనుమానం వ్యక్తంచేశారు. అమరావతికి, ఫ్యూచర్‌సిటీకి మధ్య ఏదో సంబంధం కనిపిస్తున్నదని అన్నారు. ఈ ఫ్యూచర్ సిటీ మూలాలు అమరావతికి దగ్గరగా ఉన్నాయని ఆరోపించారు.

# యాదాద్రి బోర్డులో స్థానం కల్పించాలి

- తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ మాతృ సంఘం డిమాండ్

హైదరాబాద్, మార్చి21 (నమస్తే తెలంగాణ): లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం యాదాద్రి టెంపుల్ డెవలప్‌మెంట్ బోర్డులో తమకు కచ్చితంగా స్థానం కల్పించాలని తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ మాతృ సంఘం డిమాండ్ చేసింది. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేములవాడ మదన్మోహన్, గౌరవాధ్యక్షుడు వెంకటాచారి, ప్రధాన కార్యదర్శి కృష్ణమాచార్యులు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. వైటీడీ బోర్డులో వైదిక ఆగమ శిల్పశాస్త్రంలో నిష్ణాతులైన విశ్వబ్రాహ్మణ విశ్వకర్మలను నియమించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సూచించారు. అరుదైన శిల్ప సంపద కలిగిన యాదాద్రి లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం వైభవాన్ని చాటాలని, ముఖ్యమంత్రికి, రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు విజ్ఞప్తి చేశారు.

# క్లారిఫికేషన్ ఇవ్వని భట్టి!

- అసెంబ్లీలో సభ్యులు లేవనెత్తిన అంశాలకు వివరణ ఇవ్వకుండానే మండలికి వెళ్లిన వైనం
- ఆదాయాన్ని మించి ఖర్చు చేశాం
- ఆదాయం 2.8 లక్షల కోట్లు.. వ్యయం 2.99 లక్షల కోట్లు
- 14 నెలల్లో 1.58 లక్షల కోట్ల అప్పు చేసినం
- బడ్జెట్‌పై చర్చలో భట్టి విక్రమార్క వెల్లడి



హైదరాబాద్, మార్చి 21(నమస్తే తెలంగాణ): అసెంబ్లీలో బడ్జెట్‌పై చర్చ సందర్భంగా సభ్యులు అడిగిన అనేక ప్రశ్నలకు డిప్యూటీ సీఎం, ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్క సమాధానం ఇవ్వలేదు. ప్రతిపక్ష బీఆర్‌ఎస్ సభ్యుడు హరీశ్‌రావు అడిగిన అనుమానాలకు అసంపూర్ణంగా సమాధానాలు ఇచ్చిన భట్టి.. ఇతర సభ్యులు అడిగిన సందేహాలను నివృత్తి చేయకుండానే శాసనమండలిలో తన కోసం ఎదురుచూస్తున్నారని చెప్పి వెళ్లిపోయారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై శుక్రవారం అసెంబ్లీలో జరిగిన చర్చ సందర్భంగా ఎంఐఎం, బీజేపీ, సీపీఐ సభ్యులు పలు సందేహాలు లేవనెత్తారు. అన్నింటికీ సావధానంగా సమాధాలు చెప్తానన్న భట్టి.. ఆ తర్వాత వాటి ఊసే ఎత్తకుండా మండలికి వెళ్లిపోయారు. అసెంబ్లీలో బడ్జెట్‌పై జరిగిన చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రానికి వచ్చిన ఆదాయానికి మించి తమ ప్రభుత్వం ఖర్చు పెట్టిందని తెలిపారు. అయితే, అదనంగా ఖర్చు చేసిన నిధులను ఎక్కడినుంచి తెచ్చారనే విషయం చెప్పలేదు. దీంతో ప్రతిపక్ష పార్టీ బీఆర్‌ఎస్ విమర్శలను తిప్పికొట్టాలనే ఉత్సాహంలో భట్టి విక్రమార్క అంకెల గారడీ ప్రదర్శించారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు రాష్ట్ర రెవెన్యూ ఆదాయం రూ.1,57,302 కోట్లు సమకూరగా, కేంద్ర పన్నుల వాటా ద్వారా రూ.50,032 కోట్లు, అప్పుల ద్వారా రూ.73,299 కోట్లు సమకూరినట్టు వివరించారు. ఈ విధంగా మొత్తంగా రాష్ట్ర ఆదాయం రూ.2,80,603 కోట్లుగా ఉన్నదని తెలిపారు. ఇందులో వేతనాల కింద రూ.77,342 కోట్లు, అప్పులకు అసలు, వడ్డీల కింద రూ.88,009 కోట్లు, ఇతర స్కీంల కోసం రూ.1,34,063 కోట్లు ఖర్చు చేసినట్టు వివరించారు. ఈ విధంగా మొత్తం రూ.2,99,414 కోట్లు ఖర్చు చేసినట్టు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వానికి అన్ని విధాలుగా వచ్చిన ఆదాయం రూ.2,80,603 కోట్లు కాగా, చేసిన ఖర్చును రూ.2,99,414 కోట్లుగా చెప్పడం అనుమానాలకు తావిస్తున్నది. అంటే వచ్చిన ఆదాయం కన్నా రూ.18,811 కోట్లు అదనంగా ఖర్చు చేసినట్టు వివరించారు. దీంతో ఆదాయానికి మించి ఖర్చు ఎలా చేశారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోనీ, అప్పు తెచ్చారేమో అనుకుంటే తెచ్చిన అప్పులను కూడా మొత్తం ఆదాయంలోనే చూపించారు. అలాంటప్పుడు ఆదాయానికి మించి ఖర్చు ఎలా సాధ్యమనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. దీంతో భట్టి విక్రమార్క బీఆర్‌ఎస్‌ను ఇరుకునపెట్టే ప్రయత్నంలో, తాము అంతా మంచిగనే చేశామని చెప్పుకొనే ప్రయత్నంలో అంకెల గారడీ సృష్టించారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అప్పులపై సీఎం మాదిరిగానే మళ్లీ అదే పాత కథ వల్లె వేశారు. తమ ప్రభుత్వం రూ.1,58,041 కోట్ల అప్పులు చేసిందని ఒప్పుకొన్నారు. తాము వాస్తవానికి దగ్గరగా బడ్జెట్ పెడతామని, ప్రజలను ఊహల్లో, భ్రమల్లో, ఆశల పల్లకిలో ఉంచబోమని భట్టివిక్రమార్క చెప్పారు. ప్రజలకు వాస్తవాలు చెప్పాలని, వాస్తవానికి దగ్గరగా ఉండాలని అనుకుంటున్నట్టు తెలిపారు. ఆదాయం ఎంత వస్తదో, ఎంత అవకాశం ఉంటదో అంతే చేద్దామని ప్రభుత్వం నిర్ణయించిందని పేర్కొన్నారు.

### ఇదీ భట్టివిక్రమార్క చెప్పిన లెక్క

| | |
|---|---|
| రాష్ట్ర రెవెన్యూ ఆదాయం | రూ.1,57,302 కోట్లు |
| కేంద్ర పన్నుల వాటా | రూ.50,032 కోట్లు |
| అప్పుల ద్వారా సమీకరణ | రూ.73,299 కోట్లు |
| మొత్తం ఆదాయం | రూ.2,80,603 కోట్లు |
| **పెట్టిన ఖర్చులు** | |
| వేతనాలు | రూ.77,342 కోట్లు |
| అప్పులకు అసలు, వడ్డీల చెల్లింపులు | రూ.88,009 కోట్లు |
| ఇతర స్కీంల కోసం | రూ.1,34,063 కోట్లు |
| మొత్తం పెట్టిన ఖర్చు | రూ.2,99,414 కోట్లు |
| భట్టి చెప్పిన లెక్క ప్రకారం ఆదాయానికీ, ఖర్చులకు మధ్య తేడా | -రూ.18,811 కోట్లు |

### మేం వచ్చాక ప్రజల కోసం చాలా చేశాం

తమ ప్రభుత్వం ప్రజల కోసం ఎన్నో చేసినట్టు భట్టి విక్రమార్క తెలిపారు. రైతులకు రూ.2 లక్షల లోపు రుణమాఫీ చేశామని, నిరుద్యోగులకు 57,916 ఉద్యోగాలు భర్తీ చేశామని చెప్పారు. మహిళలకు ఏటా రూ.20 వేల కోట్ల చొప్పున ఐదేండ్లలో రూ.లక్ష కోట్ల వడ్డీలేని రుణాలను అందజేస్తామని పేర్కొన్నారు. ప్రజలు అడిగితేనే ఎల్‌ఆర్‌ఎస్ ఇచ్చినట్టు వివరించారు. తమ ప్రభుత్వం ఎక్కడా భూములను అమ్మకానికి పెట్టలేదని తెలిపారు. గురుకుల స్కూళ్లన్నీ బాగున్నాయని తెలిపారు. విద్యార్థులకు రూ.829 కోట్ల ఫీజు బకాయిలు, ఓవర్సీస్ స్కాలర్‌షిప్ కింద రూ.167.28 కోట్లు చెల్లించామని వివరించారు. త్వరలోనే ఓవర్సీస్ స్కాలర్‌షిప్ మొత్తాన్ని పెంచనున్నట్టు వెల్లడించారు. గత ప్రభుత్వం పదేండ్లలో ఒక్క ఎకరాకు కూడా అదనపు సాగునీరు ఇవ్వలేదని విమర్శించారు.

# గేట్‌వాల్ హోల్ మట్టితో నింపడమేంటి?

- మంచినీళ్లు లేక వారం నుంచి గోసపడుతున్నాం
- ఎగ్లాస్‌పూర్‌లో 'భగీరథ' అధికారులను నిలదీసిన గ్రామస్తులు

మంథనిరూరల్, మార్చి 21: మంచినీటి కోసం వారం నుంచి ఇబ్బంది పడుతుంటే.. గేట్‌వాల్ హోల్‌ను మట్టితో నింపడం ఏంటని మిషన్ భగీరథ అధికారులను పెద్దపల్లి జిల్లా మంథని మండలం ఎగ్లాస్‌పూర్‌లో శుక్రవారం గ్రామస్తులు నిలదీశారు. మంత్రి నియోజకవర్గంలో ఇలా ఉంటే మారుమూల గ్రామాల్లో ప్రజలకు నీటి కష్టాలు ఇంకా ఎలా ఉన్నాయోనని మండిపడ్డారు. గ్రామంలో సుమారుగా 3వేల మంది ఉంటే.. ఎంత మందికి మంచినీరు అందిస్తున్నారో అధికారులు వెల్లడించాలన్నారు. మిషన్ భగీరథ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు మాట్లాడుతూ.. ఎగ్లాస్‌పూర్‌లో పరిమితికి మించి మంచినీటిని వాడడంతో దిగువన ఉన్న గ్రామాలకు మంచినీరు సరఫరా కావడం లేదన్నారు. రోజుకు 1.20లక్షల లీటర్ల నీటిని గ్రామానికి అందిస్తున్నామని తెలిపారు.



పెద్దపల్లి జిల్లా మంథని మండలం ఎగ్లాస్‌పూర్ గ్రామంలో సరిపడా తాగునీరు అందించాలని అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు

## లోకం పోకడ



నీళ్ల డిగితే బిందెనిండా లిప్‌స్టిక్కులు, కాటుక డబ్బాలు, ఫేష్‌వాష్, ఐ లైనర్లు వేసి ఇచ్చారు



మధు కృష్ణ (ఫైల్)



కుమ్మరి లింగన్న (ఫైల్)

# అప్పులబాధతో ఇద్దరు రైతుల బలవన్మరణం

- రుణమాఫీ కాక.. రైతు భరోసా అందక ఆదిలాబాద్ జిల్లాలో ఉరేసుకున్న లింగన్న
- మక్కపంట దిగుబడి రాక అప్పు పెరిగి పురుగుమందు తాగిన మధుకృష్ణ
- ములుగు జిల్లా చిరుతపల్లి గ్రామంలో విషాదం

తలమడుగు/వెంకటాపురం(నూగూరు), మార్చి 21: అప్పులబాధతో రాష్ట్రంలో శుక్రవారం ఇద్దరు రైతులు బలవన్మరణానికి పాల్పడ్డారు. పత్తి పంట దిగుబడి రాక, చేసిన అప్పులు తీర్చేదారి లేక ఆదిలాబాద్ జిల్లాలో ఓ రైతు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మొక్కజొన్న దిగుబడులు రాకపోవడంతో అప్పులు ఎలా తీర్చాలోనని మనస్తాపంతో ములుగు జిల్లాలో మరో రైతు పురుగు మందు తాగి తనువు చాలించాడు. ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం మండలం సుంకిడికి చెందిన రైతు కుమ్మరి లింగన్న (48)కు నాలుగెకరాల వ్యవసాయ భూమి ఉన్నది. వేసిన పత్తి పంట దిగుబడి రాలేదు. పెట్టుబడుల కోసం బ్యాంకులో రూ.3 లక్షలు అప్పులు చేశాడు. రైతు రుణమాఫీ కాక, రైతు భరోసా అందక చేసిన అప్పులు ఎలా తీర్చాలనే బెంగతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు స్థానిక ఎస్‌ఐ అంజమ్మ తెలిపారు. ములుగు జిల్లా వెంకటాపురం (నూగూరు) మండలం బర్లగూడెం జీపీ చిరుతపల్లి గ్రామంలో రైతు లుక మధుకృష్ణ (29) రెండెకరాల్లో బాండ్ మక్కజొన్న పంటను సాగుచేశాడు. పంట దిగుబడి రాకపోవడంతో అప్పులపాలయ్యాడు. దీంతో మనస్తాపం చెంది ఇంటి వద్ద పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

### మృతదేహంతో రహదారిపై ధర్నా

నకిలీ మొక్కజొన్న విత్తనాల కారణంగా పంట నష్టపోయి అప్పులబాధతో మధుకృష్ణ ఆత్మహత్యకు పాల్పడ్డాడని కుటుంబ సభ్యులు మృతదేహంతో చిరుతపల్లి గ్రామ సమీపంలోని ప్రధాన రహదారిపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. గ్రామస్థులు, గిరిజన సంఘాలు, సీపీఎం నాయకులు మద్దతుగా నిలిచారు.

# ఔట్ సోర్సింగ్ సిబ్బంది అవుట్?

మొదటిపేజీ తరువాయి...

కార్మిక తదితర శాఖల్లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల తొలగింపులు జరుగుతున్నట్టు సమాచారం. ఆయా శాఖల్లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఆందోళనకు పిలుపునిచ్చినట్టు తెలిసింది.

### సగం మంది అవుట్..

రాష్ట్రంలో కొత్తగా 50 వేల కొలువుల భర్తీ ఏమో కానీ ఉన్న ఉద్యోగాలు ఊడగొట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం వేగంగా ఫైళ్లు కదుపుతున్నట్టు తెలిసింది. జీత భత్యాల చెల్లింపుల్లో నగదు కొరతను నివారించేందుకు వీలైనంత మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను దశలవారీగా తొలగించాలని నిర్ణయించినట్టు సమాచారం. 60 ప్రభుత్వ శాఖలో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను గుర్తించి, వారిలో సగం మందిని తొలగించడానికి సన్నాహాలు చేస్తున్నట్టు తెలిసింది. పీఆర్సీ నివేదిక ప్రకారం ఆయా ప్రభుత్వ శాఖల్లో 1,20,367 మంది కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులున్నారు. తమ వంతు బాధ్యతగా ప్రభుత్వ పథకాల అమలు నిర్వర్తిస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల మెడపై రేవంత్ సర్కార్ కత్తిగట్టి తీసేస్తున్నదని ఉద్యోగులు మండిపడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎప్పుడు, ఎందుకు తీసేస్తున్నారనే సమాచారం కూడా ఇవ్వకుండా తొలగిస్తున్నట్టు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### తొలి లిస్టు సిద్ధం..

కమర్షియల్ ట్యాక్స్ శాఖలో 75 మందిని తొలగించడానికి లిస్టు సిద్ధం చేసినట్టు తెలిసింది. ఉద్యోగాలు తొలగించి తమ కుటుంబాలను బజారుకు ఈడ్చవద్దని వేడుకుంటూ శుక్రవారం ఆ శాఖ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఉన్నతాధికారులను కలిసి వినతిపత్రం సమర్పించారు. రవాణా శాఖలో మొదటి విడత కింద 62 మందిని తొలగించడానికి లిస్టు సిద్ధం చేసినట్టు సమాచారం. కార్మిక శాఖలో ఇప్పటికే ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల తొలగింపు మొదలైనదని, కాంట్రాక్టు గడువు ముగిసిన ఉద్యోగుల కాల పరిమితి తిరిగి రెన్యూవల్ చేయకుండా ఇంటికి పంపిస్తున్నట్టు తెలిసింది. తాజాగా మరో 50 మంది ఉద్యోగుల తొలగింపునకు నివేదిక రూపొందించినట్టు సమాచారం. ఎక్సైజ్ శాఖ, టీజీబీసీఎల్ నుంచి 80 మంది ఉద్యోగులను తొలగించడానికి అధికారులు లిస్టు సిద్ధం చేసినట్టు ప్రచారం జరుగుతున్నది.

# పత్రికా కథనాలు తప్పా..? మీ నివేదికలు తప్పా?

**తాగునీటి సమస్యలపై ప్రజలకు నిజాలు తెలపండి**

**మిషన్ భగీరథ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి**

**అధికారులతో మంత్రి సీతక్క వీడియో కాన్ఫరెన్స్**

హైదరాబాద్, మార్చి 21 (నమస్తే తెలంగాణ): గ్రామాల్లో ప్రజలు తాగునీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమస్యలపై వార్తా పత్రికల్లో వస్తున్న కథనాలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఎర్రమంజిల్‌లోని మిషన్ భగీరథ కార్యాలయం నుంచి గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్‌శాఖల మంత్రి సీతక్క అధికారులతో సమీక్ష నిర్వహించారు. పత్రికా కథనాలు తప్పా..? సమస్య లేదంటూ మీరు ఇస్తున్న నివేదికలు తప్పా? అని అధికారులను ప్రశ్నించారు. తాగునీటి సమస్యలు ఉన్నాయంటూ వచ్చే కథనాలపై గ్రామాల నుంచే ప్రజలకు నిజాలను తెలియజేయాలని సూచించారు. మిషన్ భగీరథ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, రోజూ ఉదయం 8 గంటలలోపు మంచినీటి సరఫరాపై తనకు నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఏజెన్సీ గ్రామాల్లో బోర్లు వేసి తాగునీరు అందిస్తున్నట్టు తెలిపారు. తాగునీటి అవసరాలు తీర్చేందుకు ప్రతీ జిల్లా కలెక్టర్ వద్ద రూ.2 కోట్ల నిధులను అందుబాటులో పెట్టామని, మిషన్ భగీరథ ప్రధాన కార్యాలయంలో 24 గంటలపాటు పనిచేసేలా కాల్‌సెంటర్ ఏర్పాటు చేశామని తెలిపారు.

# విద్యుదాఘాతంతో యువకుడు మృతి

- సబ్‌స్టేషన్‌ను ముట్టడించిన చందాపూర్ ప్రజలు
- ఐదు గంటలపాటు నిలిచిపోయిన కరెంట్ సరఫరా

మక్తల్, మార్చి 21 : విద్యుదాఘాతంతో ఓ యువకుడు మృతి చెందిన ఘటన నారాయణపేట జిల్లా మక్తల్ మండలం కర్ని సబ్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. మక్తల్ మున్సిపాలిటీ పరిధిలో చందాపూర్‌కు చెందిన మహేశ్ విద్యుత్ కాంట్రాక్టర్ వద్ద దినసరి కూలిగా పనిచేస్తున్నాడు. శుక్రవారం ఎర్సన్‌పల్లి శివారులో రైతుకు చెందిన పొలంలో విద్యుత్ లైన్ గుంజేందుకు కూలీలతో కలిసివెళ్లాడు. బోరు బావికి విద్యుత్ కనెక్షన్ ఇచ్చేందుకు కర్ని సబ్‌స్టేషన్ నుంచి ఎల్‌సీ తీసుకొని విద్యుత్ స్తంభం ఎక్కి వైర్లు సరిచేస్తున్నాడు. సబ్‌స్టేషన్‌లో ఉన్న ఏఎల్‌ఎం నితిన్, లైన్‌మన్ లక్ష్మప్ప నిర్లక్ష్యం వల్ల విద్యుత్ సరఫరా కావడంతో స్తంభంపై ఉన్న మహేశ్ విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబసభ్యులు, గ్రామస్తులు మృతదేహంతో కర్ని సబ్‌స్టేషన్ ఎదుట ఆందోళన నిర్వహించారు. విద్యుత్ సరఫరాను నిలిపివేసి సిబ్బంది ధర్నా చేశారు. మృతుడి కుటుంబానికి రూ.8లక్షల పరిహారం చెల్లిస్తామని అధికారులు చెప్పారు.

# ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నయ్!

- డీడీలు కట్టి నెలలు దాటినా ఇచ్చే దిక్కులేదు
- కరెంట్ పోతున్నది.. పంటలు ఎండుతున్నయి
- సిబ్బందితోనే సమస్యలు.. ప్రతీ పనికి పైసలు
- ఈఆర్సీ విచారణలో గోడు వెల్లబోసుకున్న రైతులు
- ఈసారి చార్జీల పెంపు ఆలోచన లేదన్న సీఎండీ



జస్టిస్ దేవరాజు నాగార్జున

హైదరాబాద్ సిటీబ్యూరో, మార్చి 21 (నమస్తే తెలంగాణ): కరెంట్ ఎప్పుడు పోతుందో, ఎప్పుడు వస్తుందో తెలియడంలేదని, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతే డీడీలు కట్టి నెలలు గడిచినా ఇచ్చే పరిస్థితే లేదని వివిధ జిల్లాలకు చెందిన రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. హైదరాబాద్ కల్యాణ్‌నగర్‌లోని విద్యుత్ నియంత్రణ్ భవన్‌లో టీజీఎస్పీడీసీఎల్ 2025–26కోసం సవరించిన ఆదాయ ఆవశ్యకత, రిటైల్ సరఫరా ధరలు, సబ్సిడీ సర్‌చార్జీల ప్రతిపాదనలపై ఈఆర్సీ చైర్మన్ దేవరాజు నాగార్జున అధ్యక్షతన జరిగిన బహిరంగ విచారణలో గోడు వెళ్లబోసుకున్నారు. ముఖ్యంగా ఈ మధ్య కాలంలో 24 గంటల కరెంట్ ఇవ్వడం లేదని, లోవోల్టేజీతో మోటార్లు కాలిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. గ్రామస్థాయిలో విద్యుత్‌శాఖ అధికారులు ఏ చిన్న పని చేయాలన్నా.. డబ్బులు డిమాండ్ చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. పంట పొలాల మధ్య ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతే వాటిని రిపేర్‌షెడ్‌కు తరలించే పనిని కూడా రైతుల మీదనే వేస్తున్నారని, ఖర్చులు కూడా అన్నదాతలపైనే మోపుతున్నారని నాగర్‌కర్నూల్‌కు చెందిన రైతులు చెప్పారు. ట్రాన్స్‌ఫార్మర్ల తరలింపు బాధ్యతను రైతులపై వేయడం వల్ల ప్రమాదానికి గురై రైతులు చనిపోయారని ఆవేదన వ్యక్తంచేశారు. పొలాల మధ్య ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను రోడ్డు పక్కకు మార్చాలని డిమాండ్ చేశారు. కరెంట్ షాక్‌తో చనిపోయిన రైతుల కుటుంబాలకు పరిహారం అందడంలేదని, జాతీయ రహదారులపై వీధి దీపాలు సరిగా ఉండడంలేదని, దాని కారణంగా ప్రమాదాలు పెరుగుతున్నాయని కొందరు రైతులు చైర్మన్ దృష్టికి తీసుకొచ్చారు.

### చేతులెత్తేస్తున్న అధికారులు

రాష్ట్రంలో అత్యధికంగా విద్యుత్ సమస్యలతో నారాయణపేట, నాగర్‌కర్నూల్ జిల్లాలు కొట్టుమిట్టాడుతున్నాయని ఎస్పీడీసీఎల్ అధికారులే తమకు చెబుతున్నారంటూ ఆయా జిల్లాల నుంచి వచ్చిన రైతులు చెప్పారు. తాము బావుల దగ్గరకు వెళ్లే పరిస్థితే లేదని, పొలాలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. మీటర్లు ఇవ్వకుండా పెనాల్టీల పేరుతో అధికారులు ఇబ్బంది పెడుతున్నారంటూ రైతులు ఈఆర్సీకి ఫిర్యాదు చేశారు. బహిరంగ విచారణకు హాజరైన వారిలో ఎక్కువమంది విద్యుత్తు సిబ్బందితో సమస్యలు ఉన్నాయని చెప్పారు. విచారణలో రైల్వే హెచ్ఎంఆర్ఎల్ వేణుగోపాల్‌రావు, డిస్కమ్ జేఎండీ శ్రీనివాసరావు, పలువురు సీజీఎంలు, సీఈలు, ఎస్ఈలు, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

నారాయణ్‌పేట జిల్లా కోస్గి మండలం నుంచి వచ్చిన సరిత అనే మహిళ తన భర్త సంజీవరెడ్డి విద్యుత్ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడని, పరిహారం అందలేదని ఈఆర్సీ చైర్మన్ దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే ఎక్స్‌గ్రేషియాకు అవసరమైన ఉత్తర్వులు జారీ చేయాలంటూ డిస్కమ్ అధికారులను చైర్మన్ ఆదేశించారు. డిస్కమ్ అధికారులు యుద్ధప్రాతిపదికన ఫైల్ ప్రాసెస్ చేసి రూ.5లక్షలకు చెక్ సిద్ధం చేయగా నాగార్జున చేతుల మీదుగా మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు.

### సిబ్బంది క్షేత్రస్థాయిలో పని చేయాలి: జస్టిస్ దేవరాజు నాగార్జున , ఈఆర్సీ చైర్మన్

విద్యుత్ సేవలపై వినియోగదారులకు అవగాహన కల్పించేలా గ్రామాల్లో ప్రత్యేక క్యాంపులు నిర్వహించాలని టీజీఈఆర్సీ చైర్మన్ జస్టిస్ దేవరాజు నాగార్జున చెప్పారు. ఎక్కడ సమస్యలు అక్కడే పరిష్కారమైతే ప్రత్యేక సమావేశాల అవసరమే ఉండదని తెలిపారు. రైతుల సమస్యలు పరిష్కరించేలా సత్వర చర్యలు చేపట్టాలని అధికారులు, సిబ్బందికి సూచించారు.


### చార్జీల పెంపు ప్రతిపాదన లేదు: ముషారఫ్ అలీ ఫారుఖీ, టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ

2025–26 ఆర్థిక సంవత్సరానికి టారిఫ్ పెంపు ప్రతిపాదన లేదని, కరెంట్ చార్జీలలో ఎలాంటి మార్పు ఉండదని టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ ఫారుఖీ తెలిపారు. టైమ్ ఆఫ్ డే ధరల్లో ఎలాంటి మార్పు ఉండదని స్పష్టంచేశారు. గ్రీన్ ఎనర్జీని ఎంచుకునే వినియోగదారులకు మాత్రం సాధారణ టారిఫ్ కంటే యూనిట్‌కు రూ.0.66 గ్రీన్ టారిఫ్ విధింపు ఉంటుందని వెల్లడించారు.

### ఎండిన చేనులో ఎడ్లు కట్టేసి వచ్చిన

డీడీ కట్టి ఎన్ని నెలలైనా ట్రాన్స్‌ఫార్మర్లు వస్తలేవు. సిబ్బందిని అడిగితే పట్టించుకుంటలేరు. పదహారునెలలైనా ఇంకా రాలేదు. వ్యవసాయమెట్ల కావాలె. పొలాలు ఎండిపోయినయి. పొలంలో ఎడ్లు కట్టేసి ఇక్కడికి వచ్చిన. - కిష్టయ్య, షాబాద్

### 24 గంటల కరెంటా.. ఎక్కడ వస్తున్నది?



నా మామిడి తోట దగ్గర పాత పోల్‌లు, లైన్ల మార్పిడి విషయంలో 2022లో ఈఆర్సీ చైర్మన్ శ్రీరంగారావు మాకు బడ్జెట్ సాంక్షన్ చేశారు. కానీ ఇప్పటివరకు మెదక్‌జిల్లా అధికారుల నిర్లక్ష్యంతో ఆ సమస్యే పరిష్కారమవడం లేదు. డీడీలు కట్టి నెలలు గడిచినా ట్రాన్స్‌ఫార్మర్లు రావడం లేదు. గద్దెలు కాంట్రాక్టర్లే కట్టియ్యాలి. కానీ రైతులే కట్టుకోవాలని అధికారులు చెప్తున్నరు. 24 గంటల కరెంట్ ఇస్తున్నామని ప్రభుత్వం చెప్తున్నది. కానీ క్షేత్రస్థాయిలో కరెంట్ ఎప్పుడు ఉంటదో, ఎప్పుడు పోతదో తెలియదు. - అనిల్‌కుమార్, మెదక్ జిల్లా

# ప్రాణాలు తీస్తున్న కరెంట్ షాకులు

- మూడు రోజులకు ఇద్దరు వ్యక్తులు బలి
- రోజుకు రెండు చొప్పన పశువులు మృతి
- ఈఆర్సీ విచారణలో ఎస్పీడీసీఎల్ వెల్లడి

హైదరాబాద్, మార్చి 21 (నమస్తే తెలంగాణ): వేలాడే తీగలు.. తెగిపడ్డ కేబుళ్లు.. స్తంభాలకు విద్యుత్తు సరఫరా.. వర్షాలు, గాలులు.. పంట రక్షణ కంచెలు.. ఇలా పలురకాలుగా కరెంటు మనుషులు, పశువుల ప్రాణాలను కబళిస్తున్నది. దక్షిణ తెలంగాణ డిస్కమ్ పరిధిలోనే 2019 నుంచి 2025 వరకు 1,531 మందిని కరెంట్ బలిగొన్నది. మరో 296 మంది తీవ్ర గాయాలపాలయ్యారు. రోజుకు రెండు చొప్పున పశువులు మృత్యువాతపడుతున్నాయి. ఈ మేరకు తెలంగాణ విద్యుత్తు నియంత్రణ మండలి నిర్వహించిన బహిరంగ విచారణలో టీజీఎస్పీడీఎల్ అధికారులు వెల్లడించారు. కరెంటు షాక్‌లతో మరణించే వారిలో రైతులే ఎక్కువగా ఉంటున్నారు. చాలామంది విద్యుత్తుశాఖ సిబ్బంది ప్రాణాలు కోల్పోవడంతో పాటు మరికొందరు వైకల్యం బారినపడుతున్నారు.

### అందని ప్రభుత్వ పరిహారం

దక్షిణ డిస్కమ్ పరిధిలోని ఆపరేషన్ ఏఈ పోస్టులు 60 వరకు ఖాళీగా ఉన్నాయి. వీటిలో గ్రామీణ ప్రాంతాల్లోని పోస్టులే ఎక్కువ. దీంతో అధికారులు కార్యకలాపాలను ఇన్‌చార్జీలతో నెట్టుకొస్తున్నారు. ఎండలు తీవ్రమవడం, విద్యుత్తుకు డిమాండ్ పెరగడంతో చాలాచోట్ల విద్యుత్తు అంతరాయం ఏర్పడటం, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోవడం వంటి ఘటనలు జరుగుతున్నాయి. ఎండుతున్న పంటలను కాపాడుకోవాలని, పంటలకు నీరందించాలన్న ఆశ రైతులన్నలను బలితీసుకుంటున్నది. వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ లేకపోవడం, వేలాడే వైర్లను విద్యుత్తు సిబ్బంది ఎప్పటికిప్పుడు సరిచేయకపోవడం, ఫిర్యాదులపై సమయానికి స్పందించకపోవడంతో రైతులే మరమ్మతులు చేసుకోవాల్సి వస్తున్నది. ట్రాన్స్‌ఫార్మర్ల ఫ్యూజులు సరిచేయడం వంటి ఘటనల్లోనే చాలామంది రైతులు ప్రాణాలు కోల్పోతున్నారు. కరెంట్ షాక్‌తో మరణించిన వారందరి కుటుంబాలకు విద్యుత్తు సంస్థలు సక్రమంగా పరిహారం చెల్లించడంలేదు. శాఖాపరమైన తప్పిదం కాదంటూ అధికారులు సాకులు చెబుతున్నట్టు పరిహారం అందని బాధిత కుటుంబాల సభ్యులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

### కరెంట్ షాక్‌తో మరణిస్తే అందాల్సిన పరిహారం

| | |
|---|---|
| వ్యక్తులు | రూ.5 లక్షలు |
| ఆవులు, బర్లు | రూ.40 వేలు |
| మేకలు, గొర్లు | రూ.7 వేలు |

| సంవత్సరం | మరణించిన వ్యక్తులు | మృతిచెందిన పశువులు | గాయపడ్డ వ్యక్తులు |
|---|---|---|---|
| 2019-20 | 258 | 619 | 34 |
| 2020-21 | 238 | 517 | 53 |
| 2021-22 | 264 | 865 | 47 |
| 2022-23 | 235 | 648 | 34 |
| 2023-24 | 288 | 876 | 71 |
| 2024-25 | 248 | 918 | 57 |



# మొదటి రోజు 'పది' పరీక్ష ప్రశాంతం

- 99.67 శాతం హాజరు

హైదరాబాద్, మార్చి 21 (నమస్తేతెలంగాణ): పదో తరగతి పరీక్ష తొలిరోజు ప్రశాంతంగా ముగిసింది. శుక్రవారం జరిగిన ఫస్ట్ లాంగ్వేజ్ ఎగ్జామ్‌కు 4.95లక్షల మంది విద్యార్థులు(99.67 శాతం) హాజరయ్యారని విద్యాశాఖ అధికారులు తెలిపారు. కొందరు ఆకతాయిలు నకిలీ ప్రశ్నపత్రాన్ని వాట్సాప్ గ్రూపుల్లో షేర్ చేసి పేపర్ లీకైనట్టు పుకార్లు సృష్టించారని పేర్కొన్నారు. ఇలాంటి తప్పుడు ప్రచారం చేస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.